లాభసాటిగా వేరుశనగ సాగు



వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతు (ఫైల్)

- రాయితీపై విత్తనాల పంపిణీ పూర్తి
- 'పొలంబడి'తో రైతులకు సాగు మెలకువలు

ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా మెట్ట భూముల్లో సాగయ్యే పంటల్లో వేరుశనగ ప్రధానమైంది. కుప్పం నియోజకవర్గంలో 7,132 హెక్టార్లలో ఈ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే అవకాశం ఉందని అధికారుల అంచనా. సాగు ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో రైతులు అధిక దిగుబడులు సాధించడానికి, తద్వారా ఆదాయ సముపార్జనకు సరైన యాజమాన్య పద్ధతులు, సాగు విధానంలో మెలకువలు పాటించాలని సూచిస్తున్నారు.

శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా 12,227 హెక్టార్ల వరకూ విస్తీర్ణంలో సాగు చేస్తారు. దీనిలో ప్రధానమైన వేరుశనగ సాగుకు జూన్ నెలారంభం నుంచి జూలై 15 వరకూ విత్తనాలను వేస్తున్నారు. రైతులు దుక్కి, విత్తనాలు సిద్ధం చేసుకుని అదును కోసం ఎదురు చూస్తున్నారు. వేరుశనగలో మువ్వకుళ్లు, వేరుకుళ్లు, ఆకు మచ్చల తెగులుతో దిగుబడులు తగ్గి పంట గిట్టుబాటు కాకుండా పోతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల్లో అవగాహన పెంచే చర్యలు తీసుకుంది. ప్రత్యేకంగా వేరుశనగ పొలంబడి ద్వారా సాగులో రైతులను నిపుణులుగా తీర్చిదిద్దుతోంది. గత సీజన్‌లో చిన్నారిదొడ్డి, రాళ్లబూదుగూరు, గుండ్లపల్లె, సొన్నేగానిపల్లె, 121 పెద్దూరు, 64 పెద్దూరు, సి.బండపల్లె పంచాయతీలలో 'పొలంబడి' నిర్వహించారు. తద్వారా మిత్రపురుగులు, శత్రు పురుగుల మధ్య తేడాను గుర్తించేలా రైతులకు అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించిన పొలానికి, సాధారణ పంటకు ఉన్న తేడాను ప్రయోగపూర్వకంగా చూపారు.

లో దుక్కులు

వేసవిలో రెండు దఫాలుగా లోతైన దుక్కులను చేస్తే భూమిలో ఉండే పురుగులు, వాటి గుడ్లు, చీడపీడల అవశేషాలు తగ్గిపోతాయి. కలుపు మొక్కల విత్తనాలు ఎండ తీవ్రతకు నిర్వీర్యమై కలుపు సమస్య తగ్గుతుంది. గత పంటల అవశేషాలు కుళ్లిపోతాయి. నేలలో తేమను నిలుపుకునే స్వభావం పెరుగుతుంది. సబ్ సాయిలర్(ఒంటి మడక) వంటి పరికరాలతో వాలుకు అడ్డంగా దున్నటం వల్ల వర్షపు నీరు ఇంకి నేలలో నీరు, పోషకాల నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఎకరా దుక్కిలో 3 ట్రాక్టరు లోడ్ల పశువుల ఎరువు వేసుకోవాలి.

విత్తనం ఎంపిక

వేరుశనగలో ప్రధానంగా కదిరి, లేపాక్షి రకాలను స్థానికంగా రైతులు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై కదిరి(కె-6) రకం విత్తనాలను పంపిణీ చేసింది. ఆసక్తి కొందరు ఉన్న రైతులకు ప్రయోగాత్మకంగా టీసీజీఎస్-1694 రకం విత్తనాలను ఇచ్చారు. దీనికి తోడుగా రైతులు సొంతంగా పండించుకున్న వివిధ రకాల విత్తనాలు ఉన్నాయి. విత్తనశుద్ధి విధిగా చేస్తే పంట తొలి దశలో వచ్చే అనేక తెగుళ్లను అరికట్టవచ్చు. శిలీంద్రనాశని, కీటక నాశని, జీవ రసాయన మందులతో కనీసం అర గంట విరామంతో మూడు వేర్వేరు దఫాలుగా విత్తనశుద్ధి చేసుకోవాలి. కిలో వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల మ్యాంకోజెబ్, 2 మిల్లీల ఇమిడాక్లోప్రిడ్, 8 గ్రాములు ట్రైకోడెర్మా విరిడితో విడి విడిగా విత్తనాలను శుద్ధి చేయాలి. దీని వల్ల వేరు కుళ్లు, విల్ట్, తొలి దశలో వచ్చే పురుగులను 25 రోజుల వరకూ సమర్థవంతంగా నివారించవచ్చు. ఎకరం చేనులో సాగుకు 60 కిలోల వరకు వేరుశనగ విత్తనాలు అవసరం అవుతాయి.

ఎరువుల యాజమాన్యం

వేరుశనగ సాగుకు ఆఖరు దుక్కిలో 20 కిలోల యూరియా, 150 కిలో సింగిల్ సూపర్ ఫాస్పేట్‌లను వేసి కలియదున్నాలి. సూటి ఎరువులు వాడలేని వారు 50 కిలోల డీఏపీ అయినా వాడుకోవచ్చు. వేరుశనగలో విత్తిన 35 రోజులకు ఎకరాకు 200 కిలోల జిప్సం వేసి మొదళ్లకు మట్టిని ఎగదోయాలి. జిప్సం వాడే సమయంలో పొలంలో తేమ లేకుంటే నేలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. విత్తిన సమయంలో, పూత దశలో, 65 రోజులకు తేమ ఉండేలా చూడాలి.

సస్యరక్షణ పద్ధతులు

లద్దెపురుగు, పచ్చ పురుగులు ప్రధాన పంటను ఆశించకుండా పొలంలో అక్కడక్కడా ఆముదం విత్తనాలను వేసుకోవాలి. రసం పీల్చే పురుగులు ఆశించకుండా కంచె పంటగా 3-4 వరుసలలో జొన్న లేదా సజ్జలు వేయాలి. అది వీలు కాకపోతే 7:1 లేదా 11:1 నిష్పత్తిలో కంది పంటను సాలుగా వేసుకోవాలి. ప్రధాన పంట వయసు 35 రోజుల దశలో ఆకుమచ్చ తెగులు ఆశించకుండా 1 గ్రాము కార్బండిజం, మువ్వకుళ్లు ఆశించకుండా 0.4 మిల్లీ ఇమిడాక్లోప్రిడ్, 5 మిల్లీల వేపనూనె లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మండలం	సాధారణ సాగు (హెక్టార్లలో)	పంపిణీ చేసిన వేరుశనగ (క్వింటాళ్లలో)	వేరుశనగ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
శాంతిపురం	3,204	1,933	2,182
కుప్పం	3,913	1,270	2,076
రామకుప్పం	2.554	1,800	1,577
గుడుపల్లె	2,556	650	570

వేరుశనగ పంటలో విల్ట్ సమస్య



ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వేరుశనగ పంటలో విల్ట్ (వేరుకాయల కుళ్లు తెగులు) ప్రభావంతో నష్టం అధికంగా ఉంటోంది. మొక్కలు మొలిచిన 3-4 వారాల్లో ఎండిపోతాయి. తర్వాత వేర్లు, ఊడలు కుళ్లిపోతాయి. ఇతర మందులతో పాటు ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేస్తే ఈ సమస్యను అదుపు చేయవచ్చు. విల్ట్ తీవ్రత అధికంగా ఉన్న పొలాల్లో విధిగా పంట మార్పిడి చేయాలి. జూలై రెండవ వారం ముగిసే లోపుగా రైతులు వేరుశనగ విత్తడం పూర్తి చేయాలి. వేరుశనగలో కంచె, సాలు పంటలకు ప్రాధాన్యత ఇస్తే ప్రధాన పంటపై పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు. –అప్పోజీ, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్ నివాళి



రామకుప్పం: మండలంలోని పంద్యాలమడుగు పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నారాయణగౌడు తల్లి సుబ్బమ్మ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు శుక్రవారం ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు రాంబాబు, శ్రీనివాసులు గౌడు, రాజారెడ్డి, నాగభూషణ్ నాయక్, గోనమాకులపల్లె సింగిల్‌విండో ప్రెసిడెంట్ శ్రీరాముల రెడ్డి తదితరులు కూడా నివాళులు అర్పించారు.

2న వాలీబాల్ పోటీలు

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత దాసరిగూడెంలో వాలీబాల్ జూన్ 2న పోటీలను నిర్వహించనున్నామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ పోటీలలో తెలంగాణ, తమిళనాడు, ఏపీలోని వివిధ ప్రాంతాలకు చెందిన 10 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయని పేర్కొన్నారు. గొల్లపల్లెమ్మ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని దాసరిగూడెంకు చెందిన సి.వెంకటేశ్వరరావు, హరిప్రసాద్ అన్నదమ్ములు వారి తల్లి చెన్నూరి క్రిష్ణమ్మ జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహించేందుకు ముందుకొచ్చారని తెలిపారు. విన్నర్స్‌కు రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.10వేల నగదు బహుమతితో పాటు షీల్డ్ కప్‌లు కూడా ఇస్తామని తెలియజేశారు. క్రీడాకారులకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పించినట్టు తెలియజేశారు.

అందుబాటులో ఎరువులు



కమ్మపాళ్యం ఆర్‌బీకేలో ఎరువుల నిల్వలు

పెద్దపంజాణి: మండలంలోని 19 ఆర్‌బీకేలలో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి రబీబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 122 మెట్రిక్ టన్నుల యూరియా, 18 మెట్రిక్ టన్నుల డీఏపీ, 12 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయని, కావలసిన రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి వార్షికోత్సవం



ప్రత్యేకాలంకారంలో చౌడేశ్వరీదేవి

సదుం: మండలంలోని జాండ్రపేట చౌడేశ్వరీదేవి ఆలయంలో పదవ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు, ప్రత్యేక అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భజన చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వి.కోటలో వాసవీమాత ఆలయం..



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

వి.కోట: పట్టణంలోని వాసవీమాత ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా మండల ఆర్యవైశ్యులు ఆలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి గంగపూజ, గణపతిపూజ, వివిధ హోమాలు, లఘు పూర్ణాహుతి, శుక్రవారం ఉదయం నుంచి మరికొన్ని ఇతర హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు





బోయకొండలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, ప్రత్యేక అలంకారంలో విరూపాక్షి మారెమ్మ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధిచేసి అమ్మవారి గర్భాలయాన్ని మామిడి, వేపాకు, పూల తోరణాలతో అలంకరించారు. రాహుకాల సమయం10:30 నుంచి 12 గంటల మధ్యలో రాహుకాల అభిషేక పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిన అమ్మవారికి పూజలు చేయించారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయానికి వచ్చి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉభయదారులకు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తులకు ఉచిత అన్న ప్రసాదం

బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద భక్తులకు సౌకర్యంగా ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాద కేంద్రం వద్ద శుక్రవారం అన్న ప్రసాదం వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ పర్యవేక్షణలో సుమారు వెయ్యిమందికి అన్న ప్రసాదం వడ్డించారు. ఉచిత అన్న ప్రసాద నిర్వహణకు దాతలు సహకరించాలని చైర్మన్ కోరారు.

మారెమ్మ ఆలయంలో..

పుంగనూరు: పట్టణంలోని బస్టాండు వద్ద ఉన్న శ్రీ విరూపాక్షి మారెమ్మకు శుక్రవారం మధ్యాహ్నం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు చలిపిండి దీపాలు వెలిగించి, పొంగలి, పెరుగు అన్నం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

రైతులు వేరుశనగ విత్తుకోవాలి



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి హేమలత

గంగవరం: మండలంలో వేరుశనగ విత్తనాలు పొందిన రైతులు తప్పనిసరిగా ఈ ఖరీఫ్ సీజన్‌లో తమ చేలల్లో విత్తుకోవాలని వ్యవసాయాధికారి హేమలత శుక్రవారం కోరారు. ఇదివరకే ఆయా గ్రామ సచివాలయాలకు చేరిన మొత్తం 1435 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయల బస్తాలు నమోదు ప్రక్రియ పూర్తయిన అనంతరం రైతులకు పంపిణీ చేశామన్నారు. మొత్తం 3,977 మంది రైతులు విత్తనాల కోసం నమోదు చేసుకుని సబ్సిడీ ధరతో పొందారన్నారు. 1,435 క్వింటాళ్ల విత్తనాలు పొందిన రైతులందరూ పంట వేసినట్లయితే మండల వ్యాప్తంగా దాదాపు 1600 ఎకరాల భూములు పూర్తిగా వేరుశనగ పంటతో నిండిపోతుందన్నారు. అయితే విత్తనాలు పొంది కూడా ఎవరైనా పంట సాగు చేయలేదని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలితే వచ్చే ఏడాది అలాంటి రైతులకు విత్తనాలు పొందే అర్హత కోల్పోతారని హెచ్చరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తప్పనిసరిగా పంట వేసి మంచి దిగుబడి సాధించాలని కోరారు.

నీటి నాణ్యతను పరిశీలించిన కమిషనర్



నీటి సంపుల వద్ద నీటి నాణ్యతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: మున్సిపాలిటీలో పరిశుద్ధమైన నీటిని సరఫరా చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు నీటి ట్యాంకుల వద్ద ఆర్‌సీటీ(రెసిడ్యూల్ క్లోరిన్ టెస్ట్)ను నిర్వహించి నీటి నాణ్యత ప్రమాణాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఈ వేసవి, వర్షాకాలంలో రుగ్మతల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు తమ నివాసాలు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

దోమలను నివారించండి



మాగాండ్లపల్లెలో ర్యాలీ చేస్తున్న మహిళలు

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాలలో దోమలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది కోరారు. శుక్రవారం మండలంలోని మాగాండ్లపల్లెలో మహిళా సంఘాలకు సమావేశం ఏర్పాటు చేసి వ్యాధులు-వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఏఎస్‌ఎం పార్వతమ్మ మాట్లాడుతూ, జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో బాధపడుతున్న పక్షంలో ఆలస్యం చేయకుండా రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. అవసరమైనప్పుడు వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రెడ్డెమ్మ, ఆశావర్కర్లు శంకరమ్మ, జయమ్మ, నాగరత్నమ్మ, కవిత, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

దళితులను అవమానిస్తే సహించం

పుంగనూరు: దళితులను అవమానించినా, దాడులు చేసిన సహించేది లేదని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్‌ఆర్.అశోక్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలమనేరులో వెంకటేష్ అనే దళితునిపై దాడి చేసి, అవమానించిన వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆటోలు ఢీకొని ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో బోల్తా పడ్డ ఆటో

సదుం: ఆటోలు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డ సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం..పొట్టింవారిపల్లెకు చెందిన బాలకృష్ణ ఆటోలో పీలేరు మార్గంలో వెళ్తున్నాడు. తిరుపతికి చెందిన దంపతులు మరో ఆటోలో వస్తున్నారు. పుట్టావారిపల్లె వద్ద రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి చేటు



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుం: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి చేటు కలిగిస్తాయని, వాటికి దూరంగా ఉండాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని సదుంలో ఆరోగ్య సిబ్బంది పొగాకు వాడకంతో వచ్చే అనర్థాలను వివరించారు. హేమలత, అరుణ, రెడ్డికుమారి, శకుంతల, మాజీ సర్పంచ్ సయ్యద్‌బాషా పాల్గొన్నరు.

వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: పుంగనూరులో నూతన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నసీరుద్దీన్ కోరారు. కళాశాలలో శనివారం నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. టెన్త్ మార్కుల ఆధారంగా అడ్మిషన్లు ఇస్తామన్నారు. రెండేళ్ల కాల వ్యవధితో కోర్సు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, వివరాలకు శుభారాం డిగ్రీ కళాశాలలోని పాలిటెక్నిక్ కాలేజీలో సంప్రదించాలన్నారు.

జోరుగా మట్టి ఇసుక అక్రమ రవాణా



అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

గుడుపల్లె: ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలో దర్జాగా ఇసుక రవాణా చేస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మండలంలోని కనమనపల్లె, గుడుపల్లె, యామగానిపల్లె గ్రామాలలో నుంచి మట్టి నుంచి తయారు చేసిన ఇసుకను రేయింబవళ్లు తరలిస్తున్నారు. కనమనపల్లె నుంచి కుప్పం పట్టణానికి ఉదయం 5 గంటలకే ట్రాక్టర్లు ఈ ఇసుకతో పరుగులు తీస్తున్నాయి. రోజంతా మట్టిని ఫిల్టర్ చేసి తయారు చేసిన ఇసుకను నిల్వ ఉంచుకుని మరుసటి రోజు గిరాకీ ఉన్న వారికి అక్రమంగా ట్రాక్టర్లతో చేరవేస్తున్నారు. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా ఎలాంటి చర్యలూ తీసుకోకుండా రెవెన్యూ అధికారులు, పోలీసులు మాత్రం నిద్రావస్థలో జోగుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రొంపిచెర్ల: జూన్ 4న ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎస్‌ఐ సుకుమార్ కోరారు. శుక్రవారం ఆయన కేంద్ర బలగాలతో రొంపిచెర్ల వీధులలో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 4న మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎవరూ బయట తిరగరాదన్నారు. ఐదారుగురు కలసి గుమికూడినా అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఘర్షణలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

కుప్పస్వామి సేవలు శ్లాఘనీయం



కుప్పస్వామిని సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్

పలమనేరు: పలమనేరు తహసీల్దార్‌గా, ప్రస్తుతం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేసిన కుప్పుస్వామి సేవలు శ్లాఘనీయమని పలమనేరు ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుప్పుస్వామి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని ఓ కళ్యాణమండపంలో ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. కొన్నేళ్లుగా భూసమస్యల పరిష్కారంలో కుప్పుస్వామి చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఆయన విశ్రాంత జీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీటీ సూర్యప్రకాష్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోకు ఉద్యోగ విరమణ సన్మానం



వెంకటరమణను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల-2 సచివాలయ వీఆర్వో వెంకటరమణ సేవలు అమూల్యమని తహసీల్దార్ మొహిద్దీన్ అన్నారు. వీఆర్వో వెంకటరమణ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలె వీఆర్వో దంపతులను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ ఆయన సేవలను ప్రస్తుతించారు. వీఆర్వో వెంకటరమణ రిటైర్మెంట్ వరకు ఎలాంటి మచ్చ పడకుండా పనిచేశారని, ఆయనలాగే అందరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీలు వెంకటరమణా రెడ్డి, లోకేష్, ఆర్ఐ అబ్దుల్ ఖాదర్, వీఆర్వోలు పల్లవి, మహేష్, శ్రీనివాసులు, ముబారక్, ఎల్లప్ప, ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బుజ్జి సేవలు వెలకట్టలేనివివి



బుజ్జిని సన్మానిస్తున్న అధికారులు, నాగరాజు

వి.కోట: 40 ఏళ్లగా వి.కోట మేజర్ గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా బుజ్జి అందించిన సేవలను వెలకట్టలేనివని పంచాయతీ సెక్రటరీ యాదవపతి కొనియాడారు. శుక్రవారం బుజ్జి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని వి.కోట సచివాలయం-1 లో సర్పంచ్ ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మానం ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు చేసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. బుజ్జి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ కుమార్‌రాజా, ఈఓ యాదవపతి, బిల్ కలెక్టర్ పృథ్వి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు ఫలితం కోసం ఆగాల్సిందే

–తొలుత నగరి, చిత్తూరు ఫలితాలు

పలమనేరు: ఈనెల 4న వెలువడే సాధారణ ఎన్నికల ఫలితాల్లో జిల్లాలోనే పలమనేరు ఫలితం కోసం ఆగాల్సిందే. జిల్లాలో 2.67 లక్షల ఓటర్లున్న పలమనేరులో అత్యధికంగా ఓట్ల లెక్కింపునకు 21 రౌండ్లు పడుతుంది. దీంతో ఫలితాలు చివరన వెలువడే అవకాశం ఉంటోంది. మరోవైపు నగరి, చిత్తూరు నియోజకర్గాల ఫలితాలు మాత్రం 17 రౌండ్లలో పూర్తి కానుండడంతో త్వరగా ప్రకటిస్తారు. మొత్తం మీద నగరి, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎవరనేది ముందుగా తెలుస్తుంది. కేవలం పలమనేరు మాత్రం ఫలితం కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ఉండగా ఈనెల 4న చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుంది.

రావి-వేప చెట్లకు కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆనందాచార్యులు

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ జంగాలపల్లెలో గ్రామస్తుల ఆధ్వర్యంలో హిందూ సాంప్రదాయరీతిలో రావి, వేప చెట్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. అర్చకుడు ఆనందాచార్యులు తొలుత నాగదేవతల రాళ్లకు అర్చనలు, అభిషేక పూజలతోపాటు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా చెట్లకు కల్యాణోత్సవం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ



ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

పలమనేరు: స్థానిక కళామందిరంలో విద్యార్థులకు నైతిక విలువలపై నిర్వహించిన వేసవి శిక్షణ శుక్రవారం ముగిసింది. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. పక్షం రోజులుగా పిల్లలకు నీతి, నైతిక విలువలు, పెద్దల పట్ల గౌరవం మొదలైన వాటి గురించి నేర్పించామన్నారు. తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి పిల్లలకు మంచి అలవాట్లతో ఉండేలా చూడాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పుష్ప, జేఎస్‌సీ మూర్తి, సీతారామయ్య పాల్గొన్నారు.